సాక్షి
వికారాబాద్

సోమవారం ▪ 20 ▪ నవంబర్ ▪ 2023



కేసీఆర్‌తోనే ప్రజాసంక్షేమం

సీఎం కేసీఆర్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య అన్నారు. 10లో ▸



తూకం తగ్గుతోంది..!

ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి రైతు.. దళారులు, కమీషన్ వ్యాపారుల చేతిలో దగాకు గురవుతున్నాడు. 10లో ▸



పథకాల పేరుతో మోసం

సంక్షేమ పథకాల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. 11లో ▸

ప్రచార హోరు



ఈవీఎంలో కారు గుర్తును చూపుతున్న వికారాబాద్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్



కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి తరఫున ప్రచారం చేస్తున్న సోదరుడు కృష్ణారెడ్డి



వికారాబాద్ రోడ్‌షోలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు గజమాల వేస్తున్న బీఎస్పీ నేతలు

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

పరిగి అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి



పీరంపల్లి రోడ్‌షోలో మాట్లాడుతున్న కొప్పుల మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలు విని హస్తం గుర్తుకు ఓటేస్తే కష్టాలను కొని తెచ్చుకోవడమేనని బీఆర్‌ఎస్ పరిగి అభ్యర్థి, ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పీరంపల్లి, బొంరెడ్డిపల్లి, బండవెల్కిచర్ల, ఎర్రగోవింద్ తండా, చెల్లాపూర్, సాల్వీడు, ఘనపూర్, బిందెంగడ్డ తండా, కామునిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కావాలంటే బీఆర్‌ఎస్‌కు, కష్టాలు కావాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, రైతుబంధు మండల కమిటీ అధ్యక్షుడు రాజు, పాంబండ ఆలయ చైర్మన్ రాములు, నాయకులు హరికృష్ణ, కృష్ణయ్య, కొండయ్య, సునంద, రాధిక, ఆంజనేయులు, వెంకటేష్, తుల్జ్యా తదితరులు పాల్గొన్నారు.

హస్తం గెలుపు ఖాయం

వికారాబాద్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్



మోమిన్‌పేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ వికారాబాద్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ వికారాబాద్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్నారు. తాము గెలిచిన వెంటనే ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ హామీల అమలులో విఫలమయ్యారని ఆరోపించారు. సగం మంది రైతులకు రుణమాఫీ అమలు కాలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ. 2లక్షల రుణమాఫీ, రూ.3 లక్షల వరకు వడ్డీ లేని పంట రుణాలు అందజేస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్‌ఎస్‌కు ఏటీఎంగా మారిందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని విమర్శించారు. సుపరిపాలన అందించే కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికి చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు నరోత్తంరెడ్డి, శుభాష్ గౌడ్, సిరాజొద్దీన్, సురేందర్, మహేందర్‌రెడ్డి, మహంత్‌స్వామి, రవి పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రీన్ కాన్హా రన్

నందిగామ: మండల పరిధిలోని కాన్హా శాంతి వనం హార్ట్‌ఫుల్ నెస్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గ్రీన్ కాన్హా రన్ ఉత్సాహంగా సాగింది. హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్ గ్రాన్యూల్స్ ఇండియాతో కలిసి చేపట్టిన కార్యక్రమంలో సుమారు 3 వేల మంది పలు కేటగిరీల్లో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్లలో నిర్వహించినట్లు, ప్రపంచవ్యాప్తంగా సుమారు 13వేల మంది ఈ రన్‌కు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కాన్హాలో నిర్వహించిన రన్‌లో విజేతలకు కాన్హా శాంతి వనం గురూజీ కమ్లేష్ పటేల్ బహుమతులను అందజేశారు. ప్రతీక్ శ్రీ వాత్సవ్, నంది, ప్రతిమ, అనిల్ ఆరోరా పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న కమ్లేష్ పటేల్

మందు..విందు..

ఎన్నికల వేళ ఏరులై పారుతున్న మద్యం

- ఎక్కడ చూసినా అడ్డాలే
- ఉదయం నుంచి రాత్రి వరకు అభ్యర్థులదే ఖర్చు
- మద్యం ప్రియులకు మరో వారం పండుగే

వికారాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు మద్యం మత్తు సోకింది. పోలింగ్‌కు మరో పది రోజులు మాత్రమే ఉండటంతో మద్యం పంపిణీ, విందు వంటివి ఊపందుకున్నాయి. దీంతో గ్రామాల్లో మద్యం ఏరులైపారుతోంది. ఎన్నికల చర్చంతా మద్యం మత్తులోనే సాగుతోంది. ప్రచారంలో పాల్గొనే వారి ఖర్చులు మొత్తం నేతలే భరిస్తున్నారు. ఉదయం టిఫెన్ మొదలుకొని మధ్యాహ్నం భోజనం, రాత్రి మందు, బిర్యానికి అయ్యే ఖర్చులన్నీ చెల్లిస్తున్నారు.

రోజంతా సిట్టింగులే..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన కొద్ది రోజులకే మద్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. పెద్దలు, యువత అని తేడా లేకుండా రోజంతా సిట్టింగులతోనే గడుపుతున్నారు. గ్రామంలోని ప్రధాన అడ్డాలు.. గ్రామ శివారులోని పొలం గట్లు మందుబాబులకు అడ్డాలుగా మారిపోయాయి. యువకులు మొదలుకొని పండు ముదుసలి వరకు మద్యం మత్తులో మునుగుతున్నారు. మూకుమ్మడిగా ఓట్లు దండుకునేందుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. ముందుగానే కావాల్సినంత మద్యాన్ని డంప్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రచారం ముగియగానే మందు, విందు ఇవ్వాల్సిందే. ఎమ్మెల్యే అభ్యర్థులు ఈ తతంగానికి దూరంగా ఉన్నప్పటికీ ఆయా పార్టీల ముఖ్య నేతలు ఈ వ్యావహారాన్ని నడిపిస్తున్నారు.

బెల్టు తీస్తున్న అధికారులు

జిల్లాలో 1,800 వరకు బెల్టు షాపులు ఉన్నట్టు అంచనా. ఎన్నికల కోడ్ ప్రారంభమైంది మొదలు అధికారులు బెల్టు షాపులపై దాడులు నిర్వహిస్తున్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు పోటాపోటీగా దాడులు నిర్వహిస్తూ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.18.80 లక్షల విలువ చేసే 3,660 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో మద్యం విక్రేతలపై దాదాపు 250పైగా కేసులు నమోదు చేశారు. గ్రామాల్లో బెల్టు షాపులు బంద్ కావడంతో మద్యం ప్రియులు పట్టణాలకు వెళ్లి మందు తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ప్రజలు, ఓటర్లకు ఇలాంటి శ్రమ లేకుండానే రాజకీయ పార్టీలు గ్రామాల్లోకి, అవసరమైతే ఇళ్ల వద్దకే వెళ్లి మద్యం పంపిణీ చేస్తున్నారు. బాటిళ్లు సరిపోకపోతే డబ్బులు కూడా ఇస్తున్నట్లు సమాచారం.



గ్రూపులుగా జతకట్టి..

గ్రామాల్లో మద్యం అలవాటు ఉన్న వారు గ్రూపులుగా జతకడుతున్నారు. నేతలు రాగానే తాము ఇంతమంది ఉన్నామని వారికి హింట్ ఇచ్చి మాకు ఇన్ని మద్యం బాటిళ్లు కావాలని పరోక్షంగా చెబుతున్నారు. నాయకులు సైతం ఒక ఓటు ఉన్నవాడిని ఒకలా.. ఎక్కువ ఓట్లు ఉన్న వారిని మరోలా ట్రీట్ చేస్తున్నారు. మద్యం పంపిణీ, ఫుడ్డు విషయంలో వారి స్థాయిని బట్టి ఇస్తున్నారు. ఇందుకు ఎంత ఖర్చయినా వెనుకాడడం లేదు. అయితే ఓటర్లు సైతం తమ పంథా మారుస్తూ అభ్యర్థులను ముప్పతిప్పలు పెడుతున్నారు. వారు రెగ్యులర్‌గా తాగే మందు ఏదైనా ఎన్నికలు వచ్చే సరికి మంచి మంచి బ్రాండ్లకు మారిపోతున్నాయి. తాము చీప్ మందు తాగడం మానేశామంటూ మెలిక పెడుతూ అభ్యర్థులకు చెమటలు పట్టిస్తున్నారు. దీంతో నేతలు సైతం చేసేదేమీ లేక మద్యం ప్రియులు డిమాండ్ చేసిన బ్రాండ్లే ఇస్తున్నట్లు సమాచారం.

మాతోనే ముదిరాజ్‌ల సంక్షేమం

- రమేష్ మహరాజ్‌కు టికెట్ ఎందుకు ఇవ్వలేదో రేవంత్ చెప్పాలి
- ముదిరాజ్‌ల సంక్షేమానికి కేసీఆర్ రూ.1,200 కోట్లు కేటాయించారు
- బీఆర్‌ఎస్ తాండూరు అభ్యర్థి రోహిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: ముదిరాజ్‌ల సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని, నియోజకవర్గంలో వారి అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని బీఆర్‌ఎస్ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో నియోజకవర్గ ముదిరాజ్ కులస్తులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల ఆర్థిక ఎదుగుదల కోసం నియోజకవర్గంలో 17 చేపల చెరువులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో మరో 40 చేపల చెరువులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి సీఎం కేసీఆర్ రూ.1200 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ సామాజిక వర్గానికి ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వకుండా రేవంత్‌రెడ్డి ఇతరులకు అమ్ముకున్నారని ఆరోపించారు. తాండూరులో ముదిరాజ్ బిడ్డ రమేష్ మహరాజ్‌కు టికెట్ ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని రేవంత్‌ను ప్రశ్నించారు. పటాన్‌చెరులో నీలం మధు ముదిరాజ్‌కు టికెట్ ఇచ్చి ఆ తరువాత అభ్యర్థిని మార్చి అవమానపరిచారని పేర్కొన్నారు. తాండూరులో ముదిరాజ్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో సొంత ఖర్చులతో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేశానని తెలిపారు. తాండూరులో పండుగల సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో 50 వేలకు పైగా ముదిరాజ్‌లు ఉన్నారని,వారు ఎటు వైపు మొగ్గు చూపితే ఆ పార్టీ అభ్యర్థి గెలుస్తాడని అన్నారు. రాజకీయాలను శాసించే సత్తా వారికే ఉందన్నారు. వారంతా బీఆర్‌ఎస్ వెంటే ఉండటం సంతోషంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్, బీసీ నేత ఆర్ అరుణ్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమాశంకర్, నాయకులు లల్లూ ముదిరాజ్, ఆకుల రాములు, రమేష్, ఎస్పీ రవి, పరిమళ, అనురాధ, రవి, మొగులయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

- మాపై బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది
- కర్ణాటక ఆరోగ్యశాఖ మంత్రి శరణ్‌ప్రకాశ్ పాటిల్



ప్రజలకు ఆరు గ్యారంటీలను వివరిస్తున్న కర్ణాటక మంత్రి శరణ్‌ప్రకాష్, టీఆర్ఆర్

పరిగి: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల పేదలకు న్యాయం జరుగుతుందని కర్ణాటక ఆరోగ్యశాఖ మంత్రి శరణ్‌ప్రకాశ్ పాటిల్ అన్నారు. ఆదివారం మండలంలోని జాఫర్‌పల్లి, పరిగి పరిధిలోని మల్లెమోనిగూడ, ఎర్రగడ్డపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి, బీదర్ ఎమ్మెల్సీ అరవింద్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని, కర్ణాటకలో గ్యారంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో కూడా తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి మచ్చలేని నాయకుడని పేర్కొన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని అన్నారు. హామీ ఇస్తే అమలు చేసే పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ ఒక్కటేనని స్పష్టం చేశారు. తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ రాష్ట్ర ప్రజల రక్తం తాగారని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయన్న కేసీఆర్.. సీఎం అయ్యాక నిరుద్యోగులను పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని నోటిఫికేషన్లు వచ్చాయో గుర్తు చేసుకోవాలన్నారు. కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎక్కడ చూసినా అన్యాయం, అక్రమాలే కనిపిస్తాయని ఆరోపించారు. పేదల భూములను నాయకులు, అభివృద్ధి పేరిట ప్రభుత్వం కబ్జా చేస్తోందని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌కు మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం అధోగతి పాలుకావడం ఖాయమన్నారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి రామ్మోహన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, కుల్కచర్ల ఎంపీపీ సత్యాహరిశ్చందర్, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార జోరు పెంచండి

- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గెలుపే లక్ష్యంగా సాగాలి
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీటీసీ మధుకర్

మర్పల్లి: ఎన్నికలు సమీపిస్తున్నందున ఎమ్మెల్యే ఆనంద్‌ను గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచార జోరు పెంచాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్యనాయకులతో సమావేశమై ప్రచార సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మేనిఫెస్టోని అమలు చేసి పేదలకు అండగా నిలుస్తుందని అన్నారు. అనంతరం జెడ్పీటీసీ మధుకర్ సమక్షంలో మర్పల్లి బీఎస్పీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేష్, ఆయన అనుచరుడు రవి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎంపీ రంజిత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరక్టర్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అర్హులకు పథకాలు

వికారాబాద్ అర్బన్: బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ వికారాబాద్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. దుకాణాలు, వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. వ్యాపారులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మరోసారి అండగా ఉండి తనను అసెంబ్లీకి పంపాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల సీజ్‌

పెద్దేముల్‌: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్‌ చేశారు. ఈ ఘటన పెద్దేముల్‌ పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది ఎస్‌ఐ కాశీనాథ్‌ తెలిపిన ప్రకారం.. ఉదయం 6గంటల సమయంలో రేగొండి నుంచి మంబాపూర్‌ గ్రామానికి ఇసుక తరలిస్తున్నారు. పట్టుకున్న పోలీసులు ట్రాక్టర్‌ యజమానులు నందు, ఏసును వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్‌ ఎన్నికల ప్రచార కమిటీ కన్వీనర్‌గా రమేశ్‌



తాండూరు: రాష్ట్ర కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ కన్వీనర్‌గా ఏఐసీసీ సభ్యుడు రమేశ్‌ మహరాజ్‌ను నియమిస్తూ ఆదివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని జోస్యం చెప్పారు. అందుకోసం ఎన్నికల ప్రచారాన్ని పక్కా ప్రణాళికతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు పార్టీని విశ్వసిస్తున్నారని, 10 ఏళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. వికారాబాద్‌ జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ప్రచార కమిటీలో చోటు కల్పించిన మల్లికార్జునఖర్గేతో పాటు రాష్ట్ర నేతలను కృతజ్ఞతలు తెలిపారు.

‘పైలట్‌’ గెలుపు తథ్యం

సర్పంచ్‌ మిత్రునాయక్‌




మల్లన్నను దర్శించుకొని బయటకు వస్తున్న మిత్రునాయక్‌

యాలాల: బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, ఎమ్మెల్యే పైలట్‌ రోహిత్‌రెడ్డికి ప్రజల ఆశీర్వాదం మెండుగా ఉందని, మరోమారు ఎమ్మెల్యేగా గెలవడం తథ్యమని మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి, బషీర్‌మియాతండా సర్పంచ్‌ మిత్రునాయక్‌ ధీమావ్యక్తం చేశారు. వారం రోజులుగా రోహిత్‌రెడ్డి గెలవాలంటూ చొక్కా, కాళ్లకు చెప్పులు ధరించకుండా ప్రతిజ్ఞ చేసిన మిత్రునాయక్‌.. వివిధ దైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం శ్రీశైలం మల్లికార్జునుడి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోహిత్‌రెడ్డి రెండోసారి గెలవాలంటూ దైవక్షేత్రాల్లో పూజలు చేస్తున్నట్లు తెలిపారు. 21న మల్లన్నను దర్శించుకున్నట్లు పేర్కొన్నారు. గెలిచిన వెంటనే తిరుపతికి కాలినడకన వెళ్లనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌ వెంట బీఆర్‌ఎస్‌ యువ నాయకులు మల్లేశ్‌, దినేశ్‌, సతీశ్‌, విశాల్‌ తదితరులు ఉన్నారు.

పోలింగ్‌ శాతం పెంచాలి

మీర్‌పేట: యువత బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకుని పోలింగ్‌ శాతాన్ని పెంచాలని బీజేపీ మహేశ్వరం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌ పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా శ్రీరాములు ఆదివారం ఆయన మీర్‌పేట కార్పొరేషన్‌ పరిధిలోని పలు డివిజన్లలో పాదయాత్ర చేసి ఓటు అభ్యర్థించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో డబుల్‌ ఇళ్లు, రేషన్‌ కార్డులు, పెన్షన్ల కోసం మహిళలు ప్రభుత్వానికి ఎదురుతిరిగారని.. బీఆర్‌ఎస్‌ అభ్యర్థిని గ్రామాల్లోకి రానిచ్చే పరిస్థితి లేదన్నారు. ఆడపడుచులంతా తనను ఆశీర్వదించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజలను భారంగా మారిన పన్నులు, నల్లా బిల్లులను తగ్గిస్తామని హామీ ఇచ్చారు.

సైకిల్‌



టీడీపీ పూర్తిగా డీలా పడుతోంది. ఎన్టీఆర్‌ పార్టీ స్థాపించిన నాటి నుంచి ‘పట్నం’ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పార్టీలో ఎదిగిన నేతలంతా సైకిల్‌ దిగి ‘కారు’, కాంగ్రెస్‌ పార్టీలో చేరుతుండడంతో తెలుగు తమ్ముళ్లు సైతం అదేబాటలో నడుస్తున్నారు.

జంగ్‌ తెలంగాణ

- అధినేత నిర్ణయంతో ఆగమన కార్యకర్తలు
- బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ కేడర్‌

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో టీడీపీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. క్రింది స్థాయి కార్యకర్తలే ఆ పార్టీకి బలమైన ఆధారం. 1952 నుంచి 1983 వరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థులకే ఇక్కడి ప్రజలు పట్టం కట్టారు. 1983లో ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హవా కొనసాగింది. ఇలాంటి సమయంలో కూడా పట్నం ఓటర్లు హస్తం పార్టీకే పట్టం కట్టారు. అయితే అనూహ్యంగా ఆ పార్టీకి 1985 ఎన్నికల్లో చెక్‌ పెట్టారు. 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కొండ్రు పుష్పలీల ఎమ్మెల్యేగా గెలిచి.. ఎన్టీఆర్‌ కేబినెట్‌లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. 2004లో కాంగ్రెస్‌ మద్దతుతో సీపీఎం అభ్యర్థి మస్కు నర్సింహ విజయం సాధించారు.

తలపడిన ‘కారు’, ‘ఏనుగు’.. మూడోస్థానానికి పరిమితమైన ‘సైకిల్‌’

నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009, 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలుపొందారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో టీఆర్‌ఎస్‌ అధికార పగ్గాలు చేపట్టింది. అప్పటివరకు టీడీపీలో కొనసాగిన కిషన్‌రెడ్డి 2015లో టీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో టీడీపీ పరిస్థితి నావికుడు లేని పడవలా తయారైంది. 2018 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌, టీడీపీ నాయకులు మహాకూటమిగా ఏర్పడ్డారు. పొత్తులో భాగంగా ఈ ఎన్నికల్లో సామ రంగారెడ్డిని టీడీపీ బరిలోకి దింపింది. అయితే కాంగ్రెస్‌ నుంచి టికెట్‌ ఆశించి భంగపడిన మల్‌రెడ్డి రంగారెడ్డి బీఎస్పీ నుంచి పోటీ చేశారు. కిషన్‌రెడ్డి, రంగారెడ్డి నువ్వానేనా అన్నట్లు తలపడ్డారు. కేవలం 356 ఓట్ల మెజార్టీతో కిషన్‌రెడ్డి గెలుపొందారు. మహాకూటమి అభ్యర్థి రంగారెడ్డి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు.

పోటీకి దూరం

టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయంతో ఈ ఎన్నికల్లో పోటీకి పార్టీ దూరంగా ఉంది. దీంతో పార్టీ శ్రేణులు గందరగోళానికి గురయ్యారు. అధినేత నిర్ణయంతో కేడర్‌ చెల్లాచెదురయింది. పోటీ నుంచి తప్పుకున్నారు సరే.. ఎవరికి మద్దతివ్వాలో స్పష్టమైన ఆదేశాలివ్వకపోవడంతో కార్యకర్తలు బిక్కమొకం వేశారు. టీడీపీ పరిస్థితిని గమనించిన బీఆర్‌ఎస్‌ నాయకత్వం కొంద మందికి గులాబీ కండువా కప్పింది. మరికొందరు కాంగ్రెస్‌ పార్టీకి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. పార్టీని నడిపించే సారథి లేకపోవడంతో ఆపార్టీ నియోజకవర్గంలో చతికిల పడింది.

సీఎం కేసీఆర్‌తోనే ప్రజా సంక్షేమం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఎల్వర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: సీఎం కేసీఆర్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని బీఆర్‌ఎస్‌ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని ప్రొద్దుటూరు, టంగటూరు, కొజ్జగూడ, ఎల్వర్తి, చందిప్ప, ఏర్వగూడ, మాసానిగూడ, కొత్తపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడోసారి ఓటు వేసి తనను అసెంబ్లీకి పంపించాలని అభ్యర్థించారు. సీఎం కేసీఆర్‌ ప్రవేశపెట్టిన పథకాలు దేశమంతటికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే పేదలకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు ఏనుగు నర్సింహారెడ్డి, గోపాల్‌, శ్రీనివాస్‌, శ్రీకాంత్‌, శాంత, ఎంపీటీసీ సభ్యులు ప్రవళిక, వెంకట్‌రెడ్డి, శోభా, దయాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్‌ పాపారావు, పీఏసీఎస్‌ చైర్మన్‌ శశిధర్‌రెడ్డి, గుడిమల్కాపురం మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌, ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌, వెంకట్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహ, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగలంతా ఏకమయ్యారు

- ప్రజలంతా నా వైపు ఉన్నారు
- కాంగ్రెస్‌ అభ్యర్థి కట్టు కథలు చెబుతున్నారు
- తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



సూరజ్‌ సింగ్‌కు కండువా కప్పుతున్న రోహిత్‌రెడ్డి

తాండూరు: తాండూరు కాంగ్రెస్‌ పార్టీలో దొంగలంతా ఏకమయ్యారని తాండూరు బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం పట్టణంలోని శాంతిమహాల్‌ సర్కిల్‌ వద్ద బీఆర్‌ఎస్‌ పార్టీ సమావేశం నిర్వహించారు. సమావేశానంతరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూరజ్‌సింగ్‌ ఠాగూర్‌తో పాటు పలువురు కార్యకర్తలు రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం కార్యకర్తలు ఆయనను గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాండూరులో 50 ఏళ్లుగా అభివృద్ధి జరగలేదని, ఐదేళ్లలో అభివృద్ధి చేసి చూపించానని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఓడించేందుకు నాయకులంతా ఏకమయ్యారని. అయినా నాడు ప్రజలు గెలిపించారని గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారని మండిపడ్డారు. 40 ఏళ్లుగా తాండూరు ప్రాంతాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో రూ.100కోట్లతో పాటు కేంద్రంలో ఉన్నతమైన పదవి కట్టబెడతామని బీజేపీ నేతలు ఆశ చూపించారని.. అయినా తలొగ్గలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు, తదితరులున్నారు.

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట

బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు వేలాదిగా ముస్లింలు హాజరై.. రోహిత్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాండూరు ప్రజల అభిమానాలే ఎమ్మెల్యేగా గెలిపించాయని తెలిపారు. రెండేళ్లుగా తాండూరు రూపు రేఖలు మార్చానని పేర్కొన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించేలా కృషి చేశానని తెలిపారు. దీంతో రాష్ట్రంలోని ఆస్పత్రి నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు.

యువతతోనే రాజకీయ మార్పు



2కే రన్‌లో పాల్గొన్న పట్టణ వాసులు

‘నేను కచ్చితంగా ఓటేస్తా’లో సీఐ వెంకట్రామయ్య

పరిగి: యువత రాజకీయాల్లోకి వస్తేనే ప్రజాస్వామ్యంలో రాజకీయ మార్పు సాధ్యమని సీఐ వెంకట్రామయ్య అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో వారియర్స్‌ బాడ్మింటన్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ×నేను ఖచ్చితంగా ఓటేస్తా« కార్యక్రమంలో భాగంగా పట్టణంలో 2కే రన్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మాట్లాడుతూ.. ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రన్‌ నిర్వహించిన అసోసియేషన్‌ను అభినందించారు. ప్రతీ పౌరుడు 30న నిర్వహించే ఎన్నికల్లో తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. యువత ఓటు హక్కును నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ భాస్కర్‌, అసోషియేషన్‌ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘కారు’తోనే ‘పట్నం’లో వెలుగులు

బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్‌: బీఆర్‌ఎస్‌తోనే నియోజకవర్గంలో వెలుగులు నిండాయని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని పోల్కంపల్లి, నాగన్‌పల్లి, ఎన్గల్‌గూడ, జాజోనిబావి, మన్నెగూడ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. పోల్కంపల్లి నుంచి అనాజీపూర్‌ వరకు పెద్ద రోడ్డు వేసింది బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమే అని గుర్తు చేశారు. నిరుపేదల సంక్షేమం అభివృద్ధికోసం పాటుపడుతున్న పార్టీకే ఓటు వేయాలని కోరారు. ఎంకేఆర్‌ ఫౌండేషన్‌ ద్వారా వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చి సుమారు 1200 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు పేదలకు సహకకరించామగని గుర్తు చేశారు. కాంగ్రెస్‌ నాయకులు మోసం చేసేందుకు యత్నిస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండి కారు గుర్తుకు ఓటేసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోల్కంపల్లి ఎంపీటీసీ సభ్యురాలు మంగ, ఎంపీపీ కృపేష్‌, సర్పంచ్‌ ఆండాలు, పీఏసీఎస్‌ చైర్మన్‌ రాజశేఖర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి , నర్సింహ, బాలు, చందు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కే మా మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌ తదితరులు

తెలంగాణ మాల ఫెడరేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌

పరిగి: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ను ఓటమికి పనిచేసిన కాంగ్రెస్‌ పార్టీని ఓడించేందుకే తెలంగాణ మాల ఫెడరేషన్‌ పనిచేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌ అన్నారు. ఆదివారం ఆయన పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్‌ మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో తెలంగాణ మాల ఫెడరేషన్‌ బీఆర్‌ఎస్‌కి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ పార్టీ అధికారం సాధించేందుకు తమ సహకారం ఉంటుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతం పేరిట రాజకీయం చేస్తోందన్నారు. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ అంబేడ్కర్‌ చేసిన సేవలను గుర్తించలేదన్నారు. కానీ తెలంగాణలో సీఎం కేసీఆర్‌ గుర్తించి అంబేడ్కర్‌కు పెద్ద విగ్రహం ఏర్పాటుతో పాటు సచివాలయానికి ఆయన పేరు పెట్టడం సంతోషించ దగిన విషయమన్నారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికి నియోజకవర్గంలోని మా కులస్తుల సంపూర్ణ మద్దతుంటుందన్నారు. పరిగిలో మరోసాఇ గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ స్టూడెంట్స్‌ జేఏసీ చైర్మన్‌ గడ్డం అశోక్‌ముదిరాజ్‌, నాయకులు వెంకట్రాములు, ఆంజనేయులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సరైన వారికే ఓటేయమని చెప్పుతున్నా..!

ఇండిపెండెంట్‌ అభ్యర్థి వినూత్న ప్రచారం



చెప్పుల జోడు మెడలో వేసుకుని ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి మహ్మద్‌ ముస్తఫా రిజ్వాన్‌

తాండూరు టౌన్‌: ఎన్నికల వేళ అభ్యర్థుల ప్రచారం వినూత్నంగా సాగుతోంది. తాండూరు నియోజకవర్గంలోని అంతారం గ్రామానికి చెందిన మహ్మద్‌ ముస్తఫా రిజ్వాన్‌ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఆయనకు ఎన్నికల సంఘం చెప్పు గుర్తు కేటాయించడంతో ఆయన మెడలో చెప్పుల జోడు వేసుకుని ప్రజలను కలుస్తున్నారు. తనకు తాను ప్రచారం చేసుకోకుండా తాండూరు సమస్యలను పరిష్కరించే నాయకుడికే ఓటేసి గెలిపించండి అంటూ నియోకవర్గంలో ఓటర్లను అవగాహన పరుస్తున్నారు. గతంలోనూ ఎమ్మెల్యే అభ్యర్థి నియోజకవర్గ సమస్యలను పట్టించుకోవడం లేదని.. ఆయనకు ఓటేసినందుకుగాను చెప్పులు, కోడిగుడ్లు, టమాటాలతో కొట్టించుకుని నిరసన వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రశ్నించే తత్వం వచ్చినప్పుడే అభివృద్ధి జరుగుతుందని ఆయన వివరించారు.

బొమ్మ పడుద్ది!

- తాయిలాలపై పార్టీ గుర్తులు, అభ్యర్థుల ఫొటోలు
- పోలీసు, వాణిజ్య పన్నుల శాఖ తనిఖీలు
- ఆయా వస్తువుల వ్యయం అభ్యర్థుల ఖర్చులోనే జమ

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికలు వస్తే రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తాయిలాలు, హామీల వర్షం కురిపిస్తుంటారు. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రలోభాలతో మచ్చిక చేసుకుంటారు. బహుమతులు, గిఫ్టులు, తాయిలాలపై ఎన్నికల సంఘం పటిష్ట నిఘా పెట్టింది. నాయకులు ఓటర్లకు అందించే రకరకాల వస్తువుల జాబితాను సిద్ధం చేసింది.

26 వస్తువుల జాబితా ఇదే..

ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రాజకీయ నాయకులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ నిఘా పెంచింది. రాజకీయ నాయకుల బొమ్మలు, పార్టీ గుర్తులు కలిగిన బెడ్‌ షీట్లు, టవళ్లు, సైకిళ్లు, మోటారు సైకిళ్లు, సీలింగ్‌ ఫ్యాన్లు, కాస్మోటిక్స్‌, క్రికెట్‌ కిట్లు, జిమ్‌ పరికరాలు, కుంకుమ భరిణిలు, మిక్సీలు, మొబైల్‌ ఫోన్లు, రెడీమేడ్‌ దుస్తులు, చీరలు, పాఠశాల బ్యాగ్‌లు, కుట్టు మిషన్లు, స్టీల్‌ వస్తువులు, టీ షర్టులు, ఎలక్ట్రానిక్‌ వస్తువులు, టీవీ సెట్లు, బొమ్మలు, ట్రావెల్‌ బ్యాగ్‌లు, సూట్‌ కేసులు, గొడుగులు, గోడ గడియారాలు, వాచ్‌లు వంటి 26 రకాల వస్తువుల పంపిణీపై నిఘా పెట్టాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

రవాణా, కొరియర్‌ సర్వీస్‌లపై నిఘా..

అనుమానాస్పద వస్తువులను పట్టుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేకంగా తనిఖీ బృందాలను నియమించింది. రైల్వే పార్శిల్‌ కార్యాలయాలు, ట్రాన్స్‌పోర్టు గోడౌన్లు, ప్రైవేటు బస్సులు, పార్శిల్‌ కేంద్రాలు, కొరియర్‌ సర్వీస్‌ కేంద్రాలు తదితర రవాణా, నిల్వ కేంద్రాలపై ప్రత్యేక బృందాలు దాడులు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నాయకులు రవాణా చేస్తున్న, నిల్వ చేసిన కోట్లాది రూపాయల విలువైన వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఆ వ్యయం అభ్యర్థుల ఖర్చులో జమ..

ఎన్నికల వేళ తాయిలాల పంపకాలు చేయాలంటే వస్తువులను గ్రామాలకు తరలించాలి. వ్యాపారుల పేరుతో వచ్చే వస్తువులు ఏంటీ, వాటిపై రాజకీయ ముద్రలు గానీ లేదా బిల్లులు లేకుండా వస్తున్నవి ఏమైనా ఉన్నాయా అని పోలీసులు, వాణిజ్య పన్నుల శాఖ ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ప్రలోభ పెట్టు వస్తువులపై పార్టీలకు చెందిన స్టిక్కర్లు, నాయకుల బొమ్మలు ఉన్నట్లయితే వాటి కొనుగోలు బిల్లులతో సరఫరా చేస్తూ పట్టుబడితే వాటిని ఆయా నాయకుల పేరుతో ఎన్నికల ఖర్చులో జమ చేస్తారు. ఎన్నికలు పూర్తయ్యాక స్వాధీనం చేసుకున్న ఆయా వస్తువుల విలువపై జీఎస్టీ చెల్లించిన తర్వాత విడుదల చేస్తారు.

కాంటాలో మోసం.. ధరల్లో వ్యత్యాసం

ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి రైతు.. దళారులు, కమీషన్‌ వ్యాపారుల చేతిలో మోసపోతున్నాడు. టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్నా.. ఎలక్ట్రానిక్‌ కాంటాలకు దిక్కే లేదు. తూకాల్లో తేడాను గమనించిన రైతులు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. అన్నదాతలకు అండగా ఉండాల్సిన వ్యవసాయ శాఖాధికారులు దళారులకు కొమ్ము కాస్తున్నారని కర్షకులు ఆరోపిస్తున్నారు.

జాడలేని ఎలక్ట్రానిక్‌ త్రాసు

- పత్తాలేని తూనికల అధికారులు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



పెద్దేముల్‌: మండల పరిధిలోని ఆత్కూర్‌, పెద్దేముల్‌, గాజీపూర్‌, బుద్దారం, ఇందూరు, మారేపల్లి, నాగులపల్లి, గోపాల్‌పూర్‌, తింసాన్‌పల్లి, హన్మాపూర్‌, గిర్మాపూర్‌, గొట్లపల్లితో పాటు పలు గ్రామాల్లో పత్తి, కంది పంటలను సాగుచేస్తున్నారు. గతంలో పత్తి రైతులు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో పంటను విక్రయించే వారు. ప్రస్తుతం పత్తి పరిశ్రమలు అందుబాటులో ఉండడంతో అమ్మకం సులువవుతుందని ఆశించిన రైతులు భంగ పడుతున్నారు. అధికారులు కొనుగోళ్లు చేపట్టక దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. గతంలో పంట పెట్టుబడి పోనూ ఎకరాకు రూ.5వేల నుంచి రూ.10వేలు ఆదాయం వచ్చేదని.. ఈ ఏడాది దిగుబడి తగ్గడం.. మార్కెట్లో ధర లేకపోవడంతో పాటు దళారుల మోసాలతో నష్టపోతున్నామని ఆందోళన చెందుతున్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలేవి?

తూకాల్లో జరుగుతున్న మోసాలను పసిగట్టి వ్యాపారులను ప్రత్యక్షంగా పట్టుకుని, అధికారులకు ఫిర్యాదు చేసినా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2020–21 సంవత్సరంలో పత్తి క్వింటాకు రూ.5,515 నుంచి రూ.5,825, 2021–22లో రూ.5,726 నుంచి రూ.6,025 వరకు 2022–23లో రూ.6,080 నుంచి రూ.6,380 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. అయితే రెండేళ్లగా ప్రభుత్వం సీసీఐ కొనుగోళ్లు చేపట్టక పోవడంతో రూ.8,500 నుంచి రూ.10వేల వరకు క్వింటా పత్తి విక్రయించామని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తామని ప్రకటించారే తప్పా.. ఎలాంటి ఏర్పాట్లు చేయలేదంటున్నారు. దీంతో దిక్కులేక దళారులను ఆశ్రయిస్తున్నారు. తూకం చేసే వ్యక్తితో దళారులు కుమ్మక్కవ్వడంతో వారు చేతివాటం ప్రదర్శిస్తున్నారని దీంతో రైతుకు నష్టం చేకూరి కమీషన్‌దారులే లాభపడుతున్నారని ఆరోపిస్తున్నారు. గతేడాది మంబాపూర్‌ గ్రామంలో ఓ రైతును రాళ్లతో తూకాలు చేసి నట్టేట ముంచారు. ఈ విషయం తెలిసిన వెంటనే దళారులు డీసీఎంను వదిలి పారిపోయారు. తర్వాత లక్ష రుపాయలు ఫైన్‌ కట్టి డీసీఎంను తీసుకెళ్లారని చెబుతున్నారు. ఈ ఘటనపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గుర్తుచేశారు.

చర్యలు తీసుకోవాలి



పత్తి రైతులను మోసం చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా రైతులకు అధికారులు అవగాహన కల్పించాలి. దళారుల బెడద లేకుండా చూడాలి. రైతులను మోసం చేస్తే దళారిని వ్యాపారం చేయకుండా అధికారులు చూడాలి. అప్పుడే పత్తి రైతుకు న్యాయం జరుగుతుంది.

– వెంకటరెడ్డి, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌, కోటపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



మందులు, కూలీల ధరలు పెరుగుతున్నాయి. కానీ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు. పత్తి క్వింటాకు రూ.10వేల తగ్గకుండా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలి. అప్పుడే రైతుకు లాభం వస్తుంది. వర్షాలకు పంటలు పాడవుతున్నాయి. ప్రభుత్వం పరిహారం ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఎల్లప్ప, రైతు, నర్సపూర్‌

అన్యాయం జరిగితే ఊరుకోం



రైతులను దళారులు మోసం చేసినట్లు ఫిర్యాదులు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. సంబంధిత అధికారులకు రిఫర్‌ చేస్తాం. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం. దళారులు కూడా ప్రభుత్వం నిర్ణయించిన తూకాల ద్వారా పత్తిని కొనుగోలు చేయాలి. రైతులు ముందుగానే తూకాలను పరిశీలించి పంటను విక్రయించాలి.

– కాశీనాథ్‌, ఎస్‌ఐ, పెద్దేముల్‌